



# మన రచయిత/త్రులు

## మద్దూరి రాజ్యశ్రీ

*'మన రచయిత/త్రులు' పేరిట శ్రీమతి రాజ్యశ్రీ ఒక్కొక్క రచయిత / రచయిత్రిని విశ్లేషిస్తూ, వాళ్ళ నవల నొకదానికి సమీక్ష రాస్తారు. శ్రీమతి రాజ్యశ్రీ ఎమెస్కో అధినేత శ్రీ యం.యన్.రావుగారి అమ్మాయి. ఆమె 200 పైగా నవలలకు ఎడిటోరియల్ వర్కు చేశారు. రీడర్స్ రిపోర్టు రాయటం, బాక్ కవరు మేటర్ రాయటం, పుస్తక ప్రపంచంలో రాబోయే నవలకు సమీక్ష రాయటం చేశారు. ఆ అనుభవంతో ఇప్పుడు మన కౌముది ద్వారా మీ ముందుకు వస్తున్నారు.*

## అరికెపూడి (కోడూరి) కౌసల్యాదేవి

కొన్ని కొన్ని నవలలో కథా వస్తువు బాగుండి, మనల్ని త్వరత్వరగా పేజీలు త్రిప్పేస్తాయి. కొన్నింటిలో ఉన్నతమైన భాష ఉపయోగింపబడుతుంది. ఒక్కో నవలలో ఒక్కొక్క వాక్యమే ఒక మహా జీవిత సత్యమై బాసిల్లుతుంది. అందలి ఒక్కొక్క భావం ఒక్కొక్క మణిపూస, ఒకొక్క పదం ఒక వెలలేని రత్నం, అందలి జీవితాలు, జీవిత గమనాలు దేశకాల భాషా పరిస్థితులకు అతీతమైనవి. ఏ దేశ ప్రజలకైనా, ఏ యుగంలోనైనా సామ్యం చేయవచ్చు. అవి ఎప్పటికీ అలా కొంగ్రొత్తగా ఉండి చిరస్థాయిగా నిలిచి పోతాయి. ఈ అన్ని లక్షణాలు ఏకీభవించిన మహాకావ్యం వికార్ ఆఫ్ ది వేక్ ఫీల్డ్ అని రచయిత్రి చెపుతారు. ఇందులో ప్రతి పదం అరికెపూడి (కోడూరి) కౌసల్యాదేవి గారి నవలలన్నిటికి అన్వయించవచ్చు.

ముందుగా కథా వస్తువు తీసుకుంటే తెలుగువారి కుటుంబ జీవితాన్ని ఆ కుటుంబంలో ఉన్న వ్యక్తిత్వాన్ని సంపూర్ణంగ ఆపోశనం పట్టారు కౌసల్యాదేవి. ఉమ్మడి కుటుంబంలో పెద్దన్నయ్య తండ్రికి చేదోడు వాదోడుగా ఎలా ఉంటాడో చూపిస్తారు. 'ఆ ఇంట్లో అందరికీ తల్లికీ, తండ్రికీ కూడా శ్రీహరిపై ప్రత్యేకమైన గౌరవం. కారణం అతడు సహనశీలి, ఉదారుడు. ప్రేమ స్పందించి, వివేకవంతుడు, బాధ్యతాయుతమైన వ్యక్తి కావటమే. అతడినెవరూ ఇంట్లో వ్యక్తిగా చూడరు. ఒక ఉన్నత వ్యక్తిగా గౌరవిస్తారు. ఒక మహాపురుషుడుగా పరిగణిస్తారు. అతని సమక్షం శరత్కాల కౌముది వలె హాయి గొలుపుతుంది. గ్రీష్మ తాప బాధితునికివటవృక్షచ్ఛాయ ఉన్నంత సుఖవంతంగా ఉంటుంది. పిపాసార్తునికి శీతల మధుర జలపానీయంగా తృప్తిపరుస్తుంది.' అటువంటి అన్న, అవసరం అయితే తండ్రికి ఇష్టం లేకపోయినా చెల్లెలి క్షేమం చూస్తాడు. 'ఎవరి అండ ఉన్నా లేకపోయినా నా అండ నీకుంటుంది. అమ్మనూ, నాన్నగారినీ కూడా ఒప్పించ గలననే ధైర్యముంది. మాకు నీ సుఖశాంతులు ముఖ్యం' అంటాడు.

ఇంటి పెద్దగా తల్లికి అవసరమైతే సుద్దులు చెప్పటానికి కూడా వెనకాడడు. 'ఇంతకు కారణం అసలు అమ్మ పిల్లలకి కడుపు నిండా తిండి పెట్టి సాకడంతోనే తమ బాధ్యత అయిపోయిందనుకునే వాళ్ళ పిల్లలలాగే అయిపోతారు. పద్మకు తను బుద్ధులు నేర్పలేదు. మనసు చెప్పనిచ్చేది కాదు. దానితో అది ఎవ్వరి భయం లేకుండా పోయింది.'ఇలాటి ఆణిముత్యాలే కాదు చీడపురుగులూ ఉన్నారు.'

'ఒక్కొక్క కొత్త మనిషి మార్పు కుటుంబంలో ఒక్కో క్రొత్తదనాన్ని సృష్టిస్తాయి. ఒక్కో సంతోషంతో పాటు ఒక్కో విచారం కూడా అనుభవించాలి' అని రచయిత్రి ఒక పాత్రచేత చెప్పించి ఆ విచారాన్ని కూడా చూపిస్తారు. 'అమ్మా, అన్నయ్య చెల్లాయ్ అని ఆప్యాయంగా సంబోదిస్తూ ఆడిపాడిన శైశవాస్థలో లేడు, మనిషిగా రూపొందిన మానవుడు. స్వార్థపరుడైన యువకుడు! నేను నా సంసారం నా బాగు అనే తాపత్రయంలో యుక్తాయుక్తాలనే మరచిన పురుషులూ ఉన్నారంటారు. 'నిన్నటి మమతలకి నేటి జీవితానికి సంబంధం లేదు? రక్త సంబంధం త్రెంచుకుంటేనే కానీ వివాహబంధం బలపడదా? 'అనుకోక తప్పదు అలాంటి వాళ్ళని చూస్తే' ఛ ఛ ఇంట పడుండే ఆడ వెధవలకేం బయట నలుగురిలో తలెత్తుకు తిరగలేక ఛస్తున్న మగవాడిని నేను. కాటికి కాళ్ళు జాపుకున్న ఆడదానికి కూడా అధికారమే. వీడి అమ్మ వీడి పెళ్ళానికి కనికరించి నాలుగు మెతుకులు పారేస్తుందిట. ఓ మూల కూర్చోబెడుతుందిట. అని నలుగురూ నవ్వుతున్నారు ఊర్లో. ఇకనైనా బుద్ధి తెచ్చుకుని కోడలికి తాళాలిచ్చి ఓ మూల పడుండు అని చిందులేస్తాడు. అత్తవారు, భార్య ఏమేమి నూరిపోస్తే అదే చిలకలా ఒప్పచెపుతాడు.

ఇకపోతే ఆమె హీరోయిన్లు ఆత్మాభిమానం, వివేచనా జ్ఞానం, నిస్వార్థం, సహనం అనే ఎన్నో మంచి గుణాలకు నిలయంగా ఉంటారు. మొదట్లోనే ఈ గుణాలన్నీ కనపడకపోవచ్చు. మొదట్లో ఆడుతూ, పాడుతూ చలాకీగా జీవితం అంటే ఏమిటో తెలీకుండా ఉంటుంది. స్నేహితులతో సినిమాలూ, కార్లలో షికార్లు, సౌధంలో నివాసం, మనసులో కోరిక ఉదయించిన వెంటనే తీర్చే తల్లిదండ్రులు, ఈ లోకంలో పెరిగిన మాధవికి లోకం అంటే ఏమిటో తెలియదు తెలుసుకోవాల్సిన అవసరమూ కలుగలేదు. నది గట్లు వెంబడి, మైదానాల మధ్యా, కుక్క పిల్లలతో పరుగులూ, చెట్టుమీద కోయిలను కవ్వించుతూ శృతి కలపటం, ఆకాశంలో కొంగకు చిప్ప చిప్ప గోళ్ళంటూ చెయ్యి చూపటంలోనే గడిచిపోయాయి.

అలాంటి హీరోయిన్ గురించి ఇంకో పాత్ర ద్వారా ఇలా వర్ణిస్తారు రచయిత్రి. 'ఈ మాధవిని ఒక సాధారణ వ్యక్తిగా అందల మెక్కించటం అసలే వీలుకాదు. కానీ అపురూపమైన అద్వితీయమైన వ్యక్తి. ఆమెకు ఆమెయే సాటి. ఆమె ఒక చైతన్య స్రవంతి అంతే. కలకల నవ్వే పూవు, గలగల పారే ఏరు, చెంగు చెంగున దూకే లేడి మిళితమై దోబూచులాడుతుంటారు మాధవిలో.'

కానీ ఒకొక్క సారి తెలిగ్గా వయోముఖ విషకుభాల బారిన పడిపోతుంటారు. ఉత్తముడిని వదిలేసి మోసగాడి వలలో పడిపోతారు. కళ్ళు తెరుచుకునే! 'అమరేంద్ర ఉత్తముడు తక్కువ బుద్ధివారితో తర్కించడు, మిడిసి పడే వారితో పంతమాడడు, దురభి మానుల ఎదుట స్వాభిమానిగా నిరూపించుకుంటాడు. అభిమాన ధనుడు గనకనే ఆనాడు తప్ప మరెప్పుడూ మరల వివాహ ప్రసక్తి తీసుకురాలేదు. అతని ముందు మోహన్ అల్పుడు, సంస్కారహీనుడు.' కానీ... మోహన్ అందం, వేషభాషలు, ఆకర్షణీయమైన నవ్వూ సరదాలూ... వైపే మొగ్గు చూపుతుంది. దాంతో కొన్ని ఢక్కా మొక్కీలు తింటుంది.

అలాకాకపోతే ఈర్ష్యతో భగ్గుమనే ఇంకో స్త్రీలవల్ల అవస్థలు పడుతుంది. కుటుంబంలో సుఖశాంతులు నెలకొల్పినా, నాశనం చేసినా ఆడవాళ్ళే, అనీ ఆడదానికి అసూయ కుష్టు రోగాన్ని మించిన అసహ్య జబ్బు అనీ వర్ణిస్తారు. అలా ఆడదాని పచ్చని బ్రతుకులో చిచ్చు రగిల్చేది మరొక ఆడదే అనీ నిరూపిస్తారు. తన మరిది కిరణ్‌కు, చెల్లెలు ఇంద్రాణి నిచ్చి పెళ్ళి చేయాలని తాపత్రయపడింది జానకి. కానీ అది జరగదని తెలిసినప్పుడు భయంకరమైన పాతక చర్యలకు కారకురాలైంది. వ్యాపారం నాశనం కావటానికి కుటుంబంలో చీలికలు ఏర్పడటానికి కారణమవుతుంది. ఆ కుట్రల కారణంగా భర్త తాగుడుకు బానిసై చనిపోతాడు, కుటుంబ కలహాలు భరించలేక అత్తగారు చనిపోతారు, వీటి కారణంగా మామగారు పిచ్చివాడవుతారు.

ది కోర్స్ ఆఫ్ ట్రూ లవ్ నెవర్ రన్స్ స్మూత్ అని సామెత. అందుకని ఇలాటి స్త్రీల వల్లో, వేరే కారణాల వల్లో ప్రేమించిన భర్తకో, ప్రియుడికో దూరమై, చాలా ఢక్కా మొక్కీలు తిని, పూజారిణిగా, చక్రవాక పక్షిగా, తపోభూమిగా మారాక కథ సుఖాంతమవుతుంది. 'తెలుసు నీలో అటువంటి గొప్ప సుగుణాలున్నాయని. అందుకే నువ్వు నాదానివి. ఇక మనం ఎప్పటికీ దూరం కావద్దు. కష్టంలో, సుఖంలో ఎప్పుడూ ఒకటే. తెలివి తక్కువ వల్ల ఇది వరకు దూరమైనా ఇప్పుడు కావద్దు' అనుకుంటారు.

ఆవిడ ఉపయోగించే శైలికూడా ఉన్నతమైన భాషగా చెప్పవచ్చు. 'బిందు, చంద్రబింబం! అందానికి నిర్వచనం, ఆనందానికి ప్రతిరూపం, అమృతానికి ఆలయం, అమాయకతకు ఆలవాలం, అదృష్ట దేవతకు ప్రియపుత్రిక. ఆమె సాధారణ మాధవి కాదు. ఒక చైతన్య స్రవంతి. తనలో తన పరిసరాలలో ఎక్కడా విచారమూ, నీరసమూ ఉండకూడదు.'

ఆవిడ ఒక్కొక్క భావం ఒక్కొక్క మణిపూస. ఒక్కొక్క పదం ఒక వెలలేని రత్నం. ఆదర్శాలనేవి ఆకాశంలో మిల మిలలాడుతూ మనల్ని ఊరించే తారకలు. వాటి కాంతితో సాగిపోవాలి కానీ, వాటి నెగిరి పట్టుకుని గుప్పిట్లో ఇముడ్చుకోవాలని చూడకూడదు. నక్షత్రాలు సూర్యకాంతిలో కనిపించవు. సూర్యుడిని మేఘం కప్పివేస్తుంది. మేఘాన్ని వాయువు తరుముతాడు. వాయువును, తన గుప్పిట్లో పెట్టుకుంటాడు పరమాత్మ. ఈ నక్షత్రాలూ, సూర్యుడు, చంద్రుడు, వాయువు మొదలైన శక్తులన్నిటి కిందా భూమి మీద నిలబడ్డ సామాన్య మానవులం మనం. ఇవన్నీ ప్రతి ఒక్కరూ ఎరిగున్నవే. అయినా ఈ కఠోర సత్యాలను జీవితాల కన్వయించుకోవటం తెలియక బాధపడి ఇంకొకర్ని బాధ పెడతారు.'

అలా అడుగడుగునా చేతులో ఏమీ లేదనీ అంతా భగవంతుని లీల అని చెపుతూనే ఉంటారు. అటువంటి అపూర్వ పుష్పాలను సృజించి ఆడించటం, ఆడుకోవటం భగవంతుడికి వినోదం కాబోలు! 'గులాబీ వెనుక ముళ్ళు, సంపంగిలో విషం, పద్మం చుట్టూ పంకం, సుకుమార శిరీషానికి అల్పాయుష్షు మొగిలి నిండా మొరటు దనం భగవద్విలాసం! దాన్ని అర్థం చేసుకుని సాగిపోవాలే కానీ, ఆయన ఉనికినే ప్రశ్నించకూడదు.'

గౌరవం పొందటానికి అధికారం చెలాయించటానికి మాత్రమే అమ్మవౌతావా? ఆదరించి లాలించి కోర్కెలు తీర్చవలసిన బాధ్యతకు దూరమౌతావా అమ్మా.

'నాకు దైవం పై నమ్మకముంది. ఏం జరిగినా మన మేలుకే అని తృప్తిపడుతుంటాను. పరిస్థితులన్నీ తాత్కాలికంగా బాధాకరమే అనిపించినా చివరికి మంచే జరిగింది. ఇది దైవలీల కాదంటారా?' అంటారు.

ఒక్కోసారి మనం ఇతరులకి చెప్పుకుని స్వయంగా పరిష్కరించుకోలేని జటిల సమస్యలకు ఓక్ మహారచయిత కావ్య సృష్టి తేలికగా పరిష్కారం లభిస్తుంది. మనం మానసికంగా ఎంతగానో ఎదుగుతాం. భావనాశక్తి అధికమౌతుంది. ఉన్నతమైన ఊహలూ, ఆలోచనలూ, కలుగుతాయి.

## శాంతినికేతన్

ప్రేమించటం తప్పుకాదు. కానీ ఆ ప్రేమని అవతలి వ్యక్తి అందులో లేకపోతే దోషం ప్రేమించిన వారిది కాదు.

ఎంతటి మహత్తరమైన నవల! ఇందులోని ప్రతి ఒక్కరూ మానవత్వంలోని ఒక్కో కఠోర సత్యాన్ని ప్రతిబింబ జేస్తుంది. వీరందరూ మానవత్వంలోని ఒక్కో అపూర్వ సుగుణానికి, అద్వితీయమైన విశిష్టతకూ ప్రతీకలు. కాల పరిమితుల నధిగమించి చిరస్థాయిగా సర్వ ప్రామాణికమై నిలిచిన నవల అని రవీంద్రుని 'నౌకా ప్రమాదం' నవల గురించి రచయిత్రి విశ్లేషించారు. అందులోని ప్రతి అక్షరం ఈ నవలకీ వర్తిస్తుంది.

ఎక్కడ చూసినా ప్రేమ, ప్రేమ. ఇంతకు మించిన లోకమే లేదా? మానవ జీవితానికతి సన్నిహిత సంబంధం గల సాహిత్య సామ్రాజ్యమంతా అనురాగ పూరితం, ప్రేమమయం. వీటినే రసవత్ ఖండాలని కీర్తిస్తారు. దేశదేశాల ప్రజలూ ఆదరిస్తారు. ఏమిటీ లోకం? ఎందుకీ సంబంధాలు? ఎక్కడివీ అనుబంధాలు? అనుకుంటుంది కాధానాయిక శాంతి.

అందుకే అన్న శ్రీహరికి అతి సన్నిహితుడైన రాజాతో స్నేహం చిగురించి, అతని ఆలోచనలు మనసుని కలవరపెడుతున్నా పెళ్ళంటే ఇష్టం లేని శాంతి అది ప్రేమగా గుర్తించలేక పోతుంది. మల్లెపూవు పరిమళం వంటి చిరునవ్వు, కొంటెతనం నాట్యమాడే కనుదోయి కలిగిన రాజా మధ్య మధ్యలో మనసుని కలవరపెడుతుంటాడు. ఎందుకో రాజాను చూడగానే మనసులో ఏమిటో భావాలు చెలరేగుతాయి. గుండె కొట్టుకుంటుంది. అతడు ఎదుట లేకపోయినా సరే ఎందుకో పదే పదే నేత్రాలలో మెదులుతాడు. నిత్యం అతడి పెదవులపై నర్తించే స్నిగ్ధ చిరు దరహాసమై అనుక్షణం గుర్తుకు వచ్చి ఎదలో గిలిగింతలు పెట్టుతోంది. అతడి కొంటెతనమే అడుగడుగునా జ్ఞాపకం వచ్చి నవ్విస్తుంది. అతడు కూడా చిత్రకారుడు కావటమే ఇందుకు కారణమా? అంతకంటే ఇంకేమీ కాదా? అనుకుంటుంది.

అంతకంటే ఇంకేమీ కాదు అని కొట్టిపారేయటం వల్లే రాజా తనని ఇష్టపడ్డా, పెద్దలు వీళ్ళ పెళ్ళికి ప్రయత్నాలు చేసినా అతన్ని తృణీకరిస్తుంది. అది రాజా మీద విముఖత్వం కాదు. మొత్తం పెళ్ళి మీదే! పైగా అన్న శ్రీహరి, 'మా జంటను చూసైన పెళ్ళి గురించి ఆలోచించు' అంటే క్షమించన్నయ్! నేను చెప్పేది ఒక వ్యక్తిత్వమంటూ ఏర్పడిన స్త్రీల గురించి. ఆమెకు అజ్ఞానవర్తనమే కానీ తన వ్యక్తిత్వం గుర్తు ఉండదు." అంటుంది రాజాని స్వయంగా క్షమాపణ వేడుకుంటుంది. రాజా కదిలి పోతాడు. 'మీ హృదయం కఠినమనుకున్నాను. కానీ మీ రూపంలాగే మీ స్వభావం కూడా ఇంత లలితమైనదని తెలుసుకోలేకపోయాను' అంటాడు. ఎదురు శ్రీహరి శాంతిని తిడితే 'ఆమె మనస్సు శిరీష కుసుమ కోమలం. ఆమెను అనవసర వాదాలతో నొప్పించలేను' అంటాడు.

తనకు రాజాతో పెళ్ళి వద్దన్న శాంతి, శాంతినికేతన్‌కి వెళ్ళి చిత్రలేఖనం అభివృద్ధి చేసుకోవాలని ఉందంటుంది. తండ్రి బలరామయ్యకి శాంతి అంటే పంచ ప్రాణాలు. వీళ్ళకి రాజమండ్రి దగ్గర దేవీ పట్నంలో ఒక బంగళా ఉంది. శాంతి పుట్టాకే కొన్నారు దాన్ని. అందుకే దానికి శాంతి నిలయం అనిపేరు పెట్టారు. అందులోని కొబ్బరి చెట్టు, పారిజాత వృక్షం, శాంతి ముగ్గురూ కవలలు. నాకు ముగ్గురు కుమార్తెలు అంటారు ఆయన. శాంతిని, కాంతిని వెదజల్లే శాంతికి ఏ విధమైన కష్టమూ ఆ పితృ హృదయం ఓర్చుకోలేదు. అందుకే తను బాధపడ్డా శాంతిని పంపిస్తాడు. రాజా కూడా దైవం దయదలిచితే బహుశ అక్కడే తన అభిప్రాయాలకు తగిన వరుడిని పొందగలదు అంటాడు.

ఏముహూర్తంలో అంటాడో గానీ శాంతి అక్కడ గోవిందరావు అనే వ్యక్తి వైపు ఆకర్షింపబడుతుంది. అతని వేణుగానం మైమరచి వింటుంది. అతనితో నృత్య నాటికలో పాల్గొంటుంది... రాజా శాంతిని, 'గోవిందరావులో ఉన్నంత విద్యా ఉండాలి మీలో' అంటాడు. గోవిందరావు మాత్రం, రాజా వేసిన పెయింటింగ్ రవీంద్రుడుని చిత్రకళా ప్రదర్శనలో శాంతి ప్రదర్శిస్తే, దానిమీద హేళనగా మాట్లాడతాడు. అతనికి గురుదేవులు రవీంద్రుని పుస్తకాలన్నా కినుకే. రాజా ఇచ్చిన ఫేర్‌వెల్ మై ఫ్రెండ్ ఉదాత్తంగా ఉంటే, గోవిందరావు ఇచ్చిన పుస్తకం చదివితే ఒంటినిండా తేళ్ళూ జెర్రెలూ పాకినట్టు ఉంటుంది. అలా ఏది బేరీజు వేసినా రాజాయే ఒక మెట్టు పైన ఉన్నాడు కానీ మానవ పోకడలు, మనసు చేసే గారడీలు విచిత్రంగా ఉంటాయి.

శాంతి మనస్సు గోవిందరావు వైపే మొగ్గు చూపుతుంది. శాంతినికేతన్‌లోనే బాగా సన్నిహితురాలైన మనోరమ శాంతికి హితువు చెప్పటానికి ప్రయత్నిస్తుంది.

'విసుక్కోకు శాంతీ, నీకు వయస్సుందన్న మాటే గానీ లోకజ్ఞానం బొత్తిగా లేదు. బహుశః అమ్మా నాన్నగార్ల అతి గారాబం, అన్నయ్య అతి లాలన నిన్నలా చేశాయనుకుంటాను. ఒక విషయం చూడు, గోవిందరావు నీకు ఇక్కడ పరిచయమైనాడు. అదైనా అంత విశేషమైన పరిచయం కాదు. అతడి గుణాలెటువంటివో, అలవాట్లు ఏమిటో, స్వభావం ఎటువంటిదో నీకు ఏమీ తెలియదు.

'నువ్వు రాజా నెందుకు చేసుకోవు? అందుబాటులో ఉన్న పాయసాన్ని వదిలి ఆకసంలోని అపరంజి పాత్రకోసమెందుకు ప్రాకులాడతావు? ఇంతకూ ఆ పాత్రలో అమృతముందో, హాలహలముందో ఎవరెరుగుదురు? రాజా సౌందర్యం, ముగ్ధమనోహరమైన అతడి సంభాషణ, గౌరవ ప్రవర్తన మొదటి పరిచయంలోనే నాకెంతో గౌరవాన్ని కలిగించాయి.మరి నువ్వెందుకు తృణీకరిస్తున్నావు?'

'రాజాపై నాకా భావం కలగలేదంతే! అయినా ఇప్పుడా చర్చ దేనికి?'అంటుంది చిరాగ్గా.

'అవును అతడిపై ఆ భావం కలగలేదు. అతడిది తొందర స్వభావము కాదు గనుక ఎప్పుడూ అనుచితంగా ప్రవర్తించలేదు గనుక!'

కానీ అదే మైనస్ పాయింట్ అవుతుంది. 'రాజా నిండుకుండ. అందుకే నాకిష్టం లేదు. ఆవేశంగా ఉత్సాహంగా ఉంటాడు గోవిందరావు ఎప్పుడూ. అతడి కతడే సాటి' అనుకుని అతను చనువుగా మాట్లాడినా ఏమీ అనుకోదు. ఎప్పటికప్పుడు మనోరమో, రాజానో శాంతిని కళ్ళలో పెట్టుకు చూస్తూనే ఉంటారు. మనోరమ బావ వచ్చి మనోరమో, రాజానో శాంతిని కళ్ళలో పెట్టుకు చూస్తూనే ఉంటారు. మనోరమ బావ వచ్చి మనోరమని తీసుకెళ్ళిపోయేటప్పుడు వాళ్ళని సాగనంపటానికి కలకత్తా వచ్చిన శాంతిని ఏ హోటల్ కో తీసుకుపోదామనుకుంటాడు గోవిందరావు. కానీ రాజా పడనివ్వడు.

వీళ్ళ ప్రేమ విషయం శాంతి తెల్సుకునే లోగా శాంతి చిన్నన్నయ్య నారాయణ వచ్చి దేవీ పట్నం తీసుకెళ్ళిపోతాడు తన పెళ్ళి కుదిరిందని. ఆ పెళ్ళికి వచ్చిన రాజాకి మనస్సు విప్పి చెప్పుకుంటుంది. ' ఆమాత్రం తెలుసుకోలేనూ? అతడి సమక్షంలో మీ వదనంలోని భావాలు! మీ ప్రవర్తన, అతడు మిమ్మల్ని ఏకవచనంతో సంబోధించటం, అధికార పూర్వకంగా మాట్లాడటం ఆ రోజున మీ ప్రవర్తన అతనికి కోపం తెప్పిస్తుందేమోననే మీ సంకోచం, భయం ఇవన్నీ చూచి నేనా నిర్ణయానికొచ్చాను,; అంటాడు.

ఒక్కసారి నిర్మలంగా ఉన్న అతడి నిగ్రహానికి, సహృదయతకూ మనస్సులోనే అంజలి ఘటించింది 'తనను వివాహమాడాలని ఉవ్విళ్ళూరాడు. అయినా తాను తిరస్కరించినా కోపం రాలేదోయ్. ఎప్పటి స్నేహ గౌరవాలకు లోపం లేదు.

గోవిందరావుతో హద్దులు మీరనని మాట ఇప్పించుకుంటాడు. దానికి కారణం వివరిస్తాడు. 'మీ జీవితాలు సున్నితమైన పూరెమ్మలు. అందుకు సదా మీగురించి మీరు అప్పులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. మాకేమిటి ఇనుప స్థంభాలం, మీకున్న వన్ని బాధలుండటానికి అంత సున్నితులం కాదు. సలహాలు పొందటానికి, జాగ్రత్త వహించటానికి కూడా అవసరంలేదు. ఈ పురుష జాతినలా పుట్టించిన భగవంతుడికి కృతజ్ఞుడిని.'

ఆ మాటలు కేవలం శాంతిని తృప్తిపరచటానికే! దక్షణేశ్వరం గుడిలో చెక్కిట చేయిని చేర్చి కాటుక దిద్దిన విశాల నేత్రాలను మరింత విశాలం చేసి ప్రతిమలలో ఒక ప్రతిమగా కనబడుతున్న శాంతిని మొదటి చూపులోనే ప్రేమిస్తాడు రాజా. 'చూడగానే ఏడు విగ్రహాలు ఎనిమిదెప్పుడయ్యాయా, అని కొద్దిగా కలవర పడవలసి వచ్చింది సుమండీ' అని చమత్కరిస్తాడు కూడా! పదివేల రూపాయలు ఇస్తామన్నా తిరస్కరించిన తన చిత్రపటం రవీంద్రుడు శాంతికి కానుగ్గా ఇస్తాడు. రాధా మాధవుల్ని చెక్కిట చెయ్యి చేర్చి చూస్తున్న తననీ హృదయంలో బంధించుకుని, చిత్రంలో బంధించి శాంతికి అది కూడా ఇస్తాడు. ఇంత ప్రేమించిన శాంతి తనని తిరస్కరిస్తే శ్రీహరితో స్నేహం చెక్కు చెదరదు కానీ అతను మాత్రం కృంగి కృశించిపోయాడో, ఎంత నిరాశ చెందాడో నాకు తెలిసినట్టు నీకు తెలియదు. అతడి సరదాలన్నీ పోయాయి. అతడి చిత్రలేఖనం మూతపడింది. అతడి చలాకీ తనమంతా నశించిపోయింది.' అందుకే శ్రీహరి మరదలు జయనిచ్చి చేస్తామన్నా ఒప్పుకోడు. 'నేను పవిత్రుడిని కాన'ని ఒక్క ముక్కలో తేల్చేస్తాడు. అయినా ఎప్పుడూ శాంతి క్షేమమే అతని ఆరాటం. 'స్వచ్ఛమైన ప్రేమకు కుల మత జాతి దేశాలనబడే ఎల్లలుండవు. సౌందర్యమనే తెరలుండవు' అంటాడు.

అతను ఒప్పుకున్నంత తేలిగ్గా అన్న ఒప్పుకోడు. 'పెద్దలు చూపే గారాన్నీ, ఇచ్చిన స్వేచ్ఛను ఇలా దుర్వినియోగం చేసుకుంటావా శాంతీ!' అంటాడు.

'నువ్వు మాత్రం వెర్రి వ్యామోహంలో పడిపోతున్నావు. చూడు మన ఆశయాలు, ఆశలే కాదు. కన్న వారిపట్ల మన ధర్మాన్ని కూడా గుర్తుంచుకోవాలి. మనం వారికేమీ పెట్టనక్కరలేదు. కేవలం వారికి తృప్తికరంగా ప్రవర్తించటం. ఇది కూడా చెయ్యలేవా శాంతీ? అందులో ఎంత త్యాగముందో, ఆ త్యాగంలో ఎంత సంతృప్తి ఇమిడి ఉందో, ఆ సంతృప్తి చాటున ఆనందం ఎంత మహత్తరమైనదో తెలుసుకో శాంతీ!

నువ్వు ఈ ఇంటికే ప్రాణానివి శాంతివి. నువ్వు ప్రసాదించిన ఈ సుఖశాంతులు నువ్వే తీసేసుకుంటావమ్మా.

నాన్నగారు ఎన్నో విధాల అపార కష్ట నష్టాలకు గురై తీవ్రమైన అశాంతికి లోనై ఉన్న సమయంలో నువ్వు పుట్టావు. కష్టాలన్నీ తీరిపోయాయి. అందుకే నువ్వు శాంతి వయ్యావు.

'మనకు పట్టింపులు లేకపోయినా పెద్దవాళ్ళకుంటాయి. నీ అభిప్రాయం మార్చుకో శాంతీ' వదిన పద్మ హితబోధ.

'మనం ప్రేమలూ, మమకారాలూ చంపుకోలేక ప్రాకులాడుతాం. వాళ్ళకు మాత్రం ఛాదస్తులుగా, ఆటంకంగా కనిపిస్తాం' తల్లి ఆవేదన.

'నువ్వు లేనిదే నాకు శాంతి లేదు శాంతీ' అంటున్న గోవిందరావు, 'నువ్వు ప్రసాదించిన శాంతి సౌభాగ్యాలను తిరిగి నువ్వే తీసుకుంటావా అమ్మా' శ్రీహరి అనునయవాక్యాలు శాంతిని కలవరపరుస్తాయి.

'భగవాన్! ఏ ప్రేమకు కట్టుపడను? ఎవరిని మన్నించను? ఎవరిని కాదనను? నాకు నేను ముఖ్యమా? వివాహం అనే పదంలో ఇంత మీమాంస నిండి ఉందా? ఏమిటీ విషయ సమస్య? ప్రతి విషయంలోనూ ప్రేమకో, భయానికో, అభిమానానికో కట్టుబడిపోయేంత అస్వతంత్రురాలుగా మానవులు సృష్టించి వినోదిస్తున్నారా.'

కానీ ఆ మర్నాడు తండ్రిని తోటలో చూసి అల్లాడిపోతుంది. 'ఇదుగో ఈ శిరీషం, ఈ నారికేళ వృక్షం, మమ్మా కవలలు. నాకు ముగ్గురు కుమార్తెలు. ఒక కూతురు శాంతినికేతనం వెళ్ళిపోయిన దగ్గర్నుంచీ ఈ ఇద్దరు కూతుళ్ళేగా నాకు శాంతి నిస్తున్నారు. ప్రతి పారిజాత పుష్పంలో కనిపించే నీ వదనం చూసుకుని, కొబ్బరి ఆకు ప్రతి కదలికలోనూ నిన్ను చూసుకుని మురుస్తున్నాను తల్లీ. మీరు ముగ్గురూ సుఖంగా సంతోషంగా ఉంటేనే ఈ శాంతినిలయంలోని మనుష్యులు శోక విచారాలకు దూరమై మసలగలరు. 'అప్పటికప్పుడు ఇకనుంచీ మీకు కష్టం కలిగించను. మిమ్మల్ని వదిలి ఎక్కడికీ వెళ్ళను' అంటుంది.

ఇంటి మనిషిగా పెరిగిన నౌకరు రామన్నకూడా 'నువ్వు లేనపుడు నువ్వు పెళ్ళి వద్దన్నావని బాబు ఎంత కుమిలిపోయారో నువ్వెరగవు చిన్నమ్మ. చిన్నప్పుడు నువ్వు కొట్టేదానవు, రక్కేదానవు, ఎప్పుడూ నీ మీద విసుక్కోలేదు చిన్నమ్మా. కానీ ఆ వేళ బాబుని చూచాక నీమీద ఎంత కోపమొచ్చిందనుకున్నావు? ఒక్కసారి అక్కడికొచ్చి కోప్పడాలనుకున్నాను. కానీ ఎంతయినా నౌకరోడిని కదా చిన్నమ్మా.'

ఈ మాటలన్నీ విని తన మనసు చంపుకోటానికి ప్రయత్నిస్తుంది. 'ఇలా కుమిలిపోతున్నావేమిటి శాంతి! నువ్వు ఈ ఇంటి ప్రాణం. ముందు నీ సుఖసంతోషాలే ప్రధానమమ్మా మాకు. నువ్వు అంతరాంతరాలలో రంపపు కోత అనుభవిస్తూంటే మేము సహించగలమా? అన్న అన్నయ్యతో లేదన్నయ్యా లేదు! నిన్నర్థం చేసుకుని, నీ అడుగుజాడల్లో నడవ ప్రయత్నిస్తున్నాను. ఆనాడు నువ్వు చేసిన హితబోధ గాలికెగిరి పోలేదు. జాగ్రత్తగా జీర్ణింపచేసుకుంటున్నాను. తనకంటే తమలోగల మాధుర్యం సంతృప్తి గుర్తించాను. అందుకనుగుణంగా నడుచుకొన గలిగేట్టూ, సాక్షాత్తూ నీ సోదరి ననిపించుకొనగలిగే ప్రవర్తన ప్రసాదించగల ఆత్మధైర్యం నాక్కలగాలని ఆశీర్వదించు అన్నయ్యా!' అంటుంది.

అన్నదే కానీ మనసుని కఠిన శిలగా మార్చుకోవటానికి మధన పడాల్సి వస్తుంది. కుటుంబంలో అందరికంటే చిన్నది కావటం వల్ల అందరి నుండీ ప్రేమానురాగాలు పొందటమేగానీ ఇవ్వటమెరుగని తాను, ఏ దుర్ముహూర్తాన అందరినీ ప్రేమించడం మొదలు పెట్టిందో ఏ వర్జ్యకాలంలో ఇతరుల పట్ల బాధ్యతలు తెలుసుకుందో అప్పటినుంచే మనసు అశాంతికి స్థావరమైపోయింది.

'నడేట్లో నావలా ఉన్న నా జీవితాన్ని ఏం చెయ్యను? ఇందుకు మానవ ప్రయత్నమా? దైవ ప్రయత్నమా? ఏది కావాలి? అనే విషయం తేల్చుకోదల్చుకున్నాను.' అందుకే తుఫాను వస్తుంది, పడవ మునిగిపోతుంది అని తెలిసి కూడా నదిలోకి రామన్నతో వెళుతుంది. అలాగే పడవ మునిగిపోవటం తథ్యమని పడవవాడు కూడా నిర్ధారించుకున్నాడు. అప్పుడు దేవుడు పంపినట్లు లాంచీలో శ్రీహరి వచ్చి వాళ్ళని కాపాడుతాడు. 'రోజూ స్కూటర్ మీద వచ్చేవాడివి ఇవాళ లాంచీలో ఎందుకు వచ్చావు? అంటే దేవుడే పంపాడు. అందుకే నా విషయంలో నేనేమీ స్వయంగా ప్రయత్నించి నిర్ధారించదలచుకోలేదు' అంటుంది శాంతి.

అది విని చలించిపోయిన శ్రీహరి, 'అన్న చెల్లెలు కోర్కెను, ముద్దు ముచ్చట్లను తీర్చాలి. కానీ నాశనము చేయకూడదు. ఎవరి అండ ఉన్నా లేకపోయినా నా అండ నీకు ఉంటుంది' అంటాడు. రాజా ఉత్తరం కూడా ఈ ఆలోచనకు దోహదం చేస్తుంది. కానీ గోవిందరావే అందుకు అర్హుడు కాదు. శాంతిని తీసుకుని కలకత్తాలో గోవిందరావుని కలిస్తే అతను హేళనగా నవ్వుతాడు. 'బెల్లం చుట్టూ చీమలు ఎందుకు చేరతాయి? కానీ బెల్లమే కరిగివస్తుంటే ఆ పాకంలో అంటుకుపోతామేమోనని భయపడి పారిపోతాయి, అహ్హహ్హహ' అంటూనే గబగబా వెళ్ళిపోతాడు.

శ్రీహరికి చాలా కోపం వస్తుంది. కానీ రాజాయే శ్రీహరికి నచ్చచెపుతాడు. కొంచెం ఓదార్పు అవసరం శాంతికి ఈ స్థితిలో ఇంతకంటే ఏం చెప్పలేను.'

'శాంతి దగ్గర ఏ అఘాయిత్యం చెయ్యనని మాట తీసుకుంటాడు. మనోరమ చేత శాంతికి ఉత్తరం రాయిస్తాడు.

'శాంతీ ఇప్పటికైనా లోకం పోకడనూ, మానవ స్వభావాలనూ అర్థం చేసుకో.రాజశేఖరం వంటి వ్యక్తి హృదయంలో స్థానం పొందగలగటం సామాన్య విషయం కాదు. అతడిని చేపట్టగల యువతి చాలా ధన్యురాలు. ఆ అదృష్టవంతురాలివి నీవే ఎందుకు కాకూడదు?' అంటూ రాసి రాజా తన భర్త శేఖర్‌కి రాసిన ఉత్తరం అందులో పొందు పరుస్తుంది. 'శాంతి నిరాశా వదనం చూసిన నాకు గుండె కరిపోయింది. ఇటువంటి స్థితిలో స్నేహితుల ఓదార్పు ఎంతైనా అవసరం. శాంతిది చాలా సుకుమార హృదయం. స్వాతన వచనాలతో మనోరమగారు ఆమెకు ఉత్తరం రాయాలోని అర్థిస్తున్నాను. కలిగించుతున్న శ్రమకు క్షంతవ్యుణ్ణి' అంటాడు అందులో.

అదికాక తను కూడా స్వయంగా రాస్తాడు. 'పరిస్థితుల ప్రభావమో, విధి బలీయతో, ఎందువల్లనో ఇత్తడిని బంగారంగా భ్రమించి ఉండవచ్చు. అది నిజంగా స్వర్ణమే అయి మనకందకపోతే బాధపడాలి కానీ, అది భ్రమ అని తేలిపోయాక విచారం దేనికి? జీవితం అటువంటి గోతిలో పడనందుకు సంతోషించాలి. దైవం రక్షించాడు.' రాజా గోవిందరావుని స్వయంగా ఒప్పిద్దామని వెళితే అతను మోసగాడని, అతనికిది వరకే పెళ్ళయిందనీ తెలుస్తుంది.

రాజా ఈ తాపత్రయం చూసి శాంతి కరిగిపోతుంది. రాజా స్వభావం ఈ వెన్నెల వంటిది. అతడి మంచితనమే అతడిది కానీ, ఎదుటి వారి గుణగణాలతో అతడికి నిమిత్తం లేదు అనుకుంటుంది. క్రమంగా శాంతి పూర్వపు శాంతి కాసాగింది. తరచూ గోవిందరావులోని మాలిన్యాన్ని, రాజాలోని స్వచ్ఛతనీ పోల్చుకోవటంలో ఆమె మనస్సులో రాజా ఎక్కువగా మెదలసాగాడు. అందుకే తన ప్రేమనంతా రంగరించి రాజాకు ఉత్తరం రాస్తుంది. మీ శాంతి అని ముగించి దాని కింద అందంగా ఆకులతో ఉన్న గులాబి పుష్ప గుచ్ఛం చిత్రీకరించింది. రాజా ఆనందానికి అవధులు లేవు. ఇది వరలో ఆమె హృదయానికి ప్రేమ స్పందన లేదు. మనస్సుకి భావ పరిపక్వం లేదు. అప్పుడు జీవితమంటే తెలియని మొగ్గ. ఇప్పుడు సంపూర్ణజ్ఞాన వికసిత అయింది. అవును! ఒక్కొక్కరిని అందరు మానవుల

మాదిరిగా సృష్టించడు భగవంతుడు. వారిన్ని విధాలా ప్రత్యేకంగా ఉంటారు. ఏదైనా అపూర్వ సన్నివేశం వారిలో మార్పు తేవాలి. పద్మం వికసించటానికి సూర్యోదయమే కావాలి. కలువను శశాంకుడే రంజింపజేయాలి అనుకుంటాడు.

కానీ వాళ్ళ ప్రేమ కథకింకా అప్పుడే ముక్తాయింపు దొరకదు. ఆ ఉత్తరానికి రాజా రాసిన జవాబు అందదు. చిన్న వదినె మాయం చేస్తుంది. రాజా కిష్టం లేదేమో అనుకుంటుంది శాంతి. శాంతి కిష్టం లేదేమో అనుకుంటాడు రాజా. అందుకే జయని చేసుకోవాలని మళ్ళీ ప్రస్తావన తేస్తే వెంటనే అంగీకరిస్తాడు. రాజా ఇచ్చిన చిత్రాలు రాజా వచ్చినప్పుడు తన గదిలో తగిలిస్తే వదిన పద్మ శాంతి హృదయం మారిన వైనం గమనించి 'అదృష్టవంతురాలివి శాంతీ!' అని అభినందిస్తుంది కూడా. రాజా కూడా చూసినా మొహం తిప్పేసుకుంటాడు. దాంతో శాంతి చిన్నబుచ్చుకుంటుంది.

తర్వాత ఇద్దరూ మనసు విప్పి మాట్లాడుకున్నప్పుడు అసలు విషయాలు తెలుస్తాయి. మీకు హృదయం విలువా, మనిషి విలువ తెలియవు. దేనికీ స్థిర నిశ్చయం లేదు మీకు. అటూ, ఇటూ ఊగుతారు. అందువల్ల మీకూ, నాకూ సరిపడదని తెలుసుకున్నాను' అంటాడు రాజా ముందు.

తర్వాత అతను రాసిన ఉత్తరంలో శశి అన్న అమ్మాయితో తనకేదో సంబంధం ఉందన్న పుకార్ల గురించి శాంతి నుంచీ స్వాతన కోరుతూ రాసానని, దాని గురించి తను జవాబు రాయకపోయేసరికి కోపం వచ్చిందనీ చెపుతాడు. 'నేనామెను మనస్ఫూర్తిగా ప్రేమించాను. తృణీకరించినా కోపం తెచ్చుకోలేదు. గోవిందరావు విషయంలో కూడా అసూయ పడకుండా ఆమె క్షేమాన్ని కాంక్షించాను. అటువంటి ఈ ఒక్క విషయంలోఅందునా యదార్థ దూరమైన విషయంలో సానుభుతి చూపలేకపోయింది నన్నర్థం చేసుకోలేకపోయింది. ఇటువంటి వ్యక్తి నాకెందుకు? అనుకున్నాను' అంటాడు.

ఉత్తరం వదిన శ్యామల మాయం చేసిందని విని బాధపడ్డాడు. 'శాంతీ! ఎందుకేడుస్తారు? ఎవరో ప్రేమికుల్ని విడదీసి మహాపాపానికి ఒడిగట్టిన మూర్ఖులమై ఉండాలి మనం. అందుకే ఇలా అందీ అందకుండా జేసి మన జీవితాల చుట్టూ విషవలయాలు అల్లి ఆడుకుంటున్నాడు దైవం.'

ముందుగా రాజా శాంతి తన వివాహం విషయం విని కూడా అంత నవ్వుతూ ఎలా అభినందించిందని అడుగుతాడు. ఏం నా మిత్రుల వివాహం నాకు ఆనంద దాయకము కాదా? అంటుంది. రాజా నవ్వులో ప్రపంచంలోని విషాదమంతా కురిసింది. 'నేను పసిపిల్లవాడిని కాదు శాంతీ మభ్యపెట్టటానికి. ఇది వరలో నేనొక్కడినే దురదృష్టవంతుడిననుకునేవాడిని. కానీ మీరూ అంతే! అదృష్టవంతులైన దురదృష్టవంతులం మనం' అంటాడు.

కానీ అదే శ్యామల జయతో కూడా పెళ్ళి చెడగొడుతుంది. రాజా దేశాలు పట్టిపోతాడు. శాంతి బండబారిపోతుంది. ఇప్పుడు శాంతినికేతన్ గుర్తుకొచ్చినా హృదయం వ్యధ భరితంకాదు. గోవిందరావుపై కినుకలేదు. రాజాపై కోరిక లేదు. జయపై అసహ్యమూ లేదు. శ్యామలపై ద్వేషము లేదు. అందరూ భగవత్ సృష్టిలోని భిన్నరూపాలు. ఒక్కొక్క తరహా మానవ స్వభావానికి ప్రతినిధులు వారిలో తను ఒకతె! ఎవరినీ ద్వేషించవలసిన, ఎవరినీ చూసి ఆశ్చర్యపడవలసిన అగత్యం లేదు. ఇది ప్రపంచం! హృదయం కల్లోక దైరమై స్పటిక స్వచ్ఛతతో భాసిస్తోంది. అందుకు కారణమైనఆ దయామయునికి అభినందనలు!

'మీ మనస్సెంత అమృతమో అని ఆలోచిస్తున్నాను' అని రాజా శాంతితో ఒక సందర్భంలో అంటే

'మీరు మనిషే అమృతం కనుక మీకు అట్లా అనిపిస్తుంది మీ మార్గమే ఆచరణ యోగ్యమయింది. ఇది వరకు ఎవ్వరేమన్నా చటుక్కున కోపం వచ్చేసేది. ఇప్పుడు ఎవరిపైనా ఆగ్రహం రాదు. ఏ పరిస్థితుల్లోనైనా మీరూ, ఆగ్రహ దూరమైన మీ ప్రవర్తనా గుర్తుకు వస్తాయి. అదే ఎంతో బలంగా ఉంటుంది. ఇప్పుడు చెప్పండి మీరు పొగడిన నా మంచితనం ఎవరికి చెందినదో!' అంటుంది శాంతి రాజా.

ఇంత అమృత తుల్యులుని కలపకపోతే బాగుండదనుకున్నాడేమో ఆ దయామయుడు కొన్ని మలుపుల తర్వాత వాళ్ళ కథ సుఖాంతమవుతుంది.

*శాంతీ! మనవి పూర్తిగా పరాధీన జన్మలు మానవ మాత్రులం. భగవదధీనంలోని మట్టి బొమ్మలం. ఆశ నిరాశల మధ్య ఊగే ఉయ్యాల మన జీవితం. ఇవాళ ఆశించిన ఆశయం అందక పోవచ్చు. రేపు అనుకోని అదృష్టం వరించవచ్చు అంత మాత్రాన కృంగిపోకూడదు, పొంగిపోకూడదు.*

